
# సాహచర్యం

- గంటి భానుమతి



ఆర్నెల్లుగా, ఆ ప్రపంచంలోకి తొంగి చూస్తున్నాను. అది నాకు తెలీకుండానే జరిగిపోయింది.

ఆ ప్రపంచం ఊహా లోకాల్లోకి తీసుకెళ్ళే ఉటోపియా కాదు. అశలు కల్పించే శ్రీశ్రీ మహా ప్రపంచం అంతకన్నా కాదు.

నేనున్న ఫ్లాటులోంచి కనిపించే పక్క పెరటి ప్రపంచం. ప్రతీ క్షణం నన్నెక్కడికో తీసుకెళ్ళే ప్రపంచం అది.

నేను కాఫీ తెచ్చుకుని కుర్చీలో కూచునే సమయం, రేడియోలో తెలుగు వార్తలు వచ్చే సమయం, కొబ్బరాకుల్లోంచి బంగారు ఎండ ఏటవాలుగా, పాయలు పాయలుగా ఆ పెరట్లోని గోడ మీద వాలే సమయం అన్నీ ఒక్కసారే.

నాకు అప్పుడే తెల్లారినా, ఆ పెరట్లోని ప్రపంచం అప్పటికే చైతన్యం అయిపోతుంది. ఆర్నెల్లుగా అదే రొటీన్. ఏ మాత్రం మార్పు నాక్కనపడలేదు.

ఆ ప్రపంచంలో ఉండేది ఇద్దరు. వయసులో పెద్దవాళ్ళే. అనుభవాల మడతలు, వాళ్ళ శరీరాలని అంటిపెట్టుకుని ఉన్నాయి.

వాళ్ళకి పిల్లలున్నారో లేదో తెలీదు. ఈ ఆర్నెల్లుగా వాళ్ళింట్లో మూడో మనిషిని చూళ్ళేదు. అందుకని ఆ తర్వాత తరం గురించి నాకు తెలీదు.

పార్వతీ, పార్వతీ... అని ఆయన పిలుస్తూంటే, ఆవిడ పేరు పార్వతి అని అర్థం అయింది. ఇంకాయనకి వేరే పేరెందుకని పరమేశ్వరం అని నేనే పెట్టాను.

నేను పెరట్లోకి తొంగి చూసే టైములో పరమేశ్వరంగారు పేము కుర్చీలో పేపరు చదువుతూ ఉంటారు.

"పార్వతీ రెండో డోసు పళ్ళేదు..." అతని గొంతు.

"తెస్తున్న..." ఆవిడ గొంతు లోపల్నించి.

సరిగ్గా అదే సమయాన ఎండు కొబ్బరాకుల్లోంచి, ఆ పెరటి గోడ మీదకి జారుతుంది. నేను కాఫీ తాగేది. వార్తలు వచ్చేది ఆ సమయాన్నే.

పొద్దున్న నాకు వంట పని ఉండదు. నేను పనిచేసే అంతర్జాతీయ స్కూల్లోనే అన్నీ, ఎనిమిది వరకూ, ఆ బాల్కనీలో గడిపి, ఆ తర్వాత తయారవుతాను. బస్సు వస్తుంది. మూడు కిలోమీటర్ల దూరంలో వున్న ఆ పెద్ద స్కూల్లో దింపుతుంది.

ఆ స్కూలు వాళ్ళిచ్చే జీతం... మిగిలిన సౌకర్యాల మూలంగా, ఆర్నెల్ల క్రితం జగదీశ్‌కి మెహబూబ్‌నగర్ ట్రాన్స్‌ఫర్ అయితే నేను వెళ్ళలేదు. పిల్లలిద్దరూ, చేరోచోట ఇంజనీరింగ్ చదువుతున్నారు.

"ఎక్కువక్కర్లేదు. ఓ మిళ్ళి గిన్నెడు చాలు..." అతని గొంతు.

"అలాగే..." ఆవిడ జవాబు.

ఆవిడ వేలిముడి వేసుకుని, ఎరుపు, ఆకుపచ్చ గళ్ళ చీరకి మావి చివురంచున్న చీర కచ్చాపోసి కట్టుకున్న మడి చీరతో, ఓ చిన్న గ్లాసుని పరమేశ్వరంగారు కూచున్న కుర్చీకి దగ్గర్లో టక్కు మంటూ పెడ్తారు.

తరవాత ఓ నాలుగు మందారాలని కోసి, గుబురుగా ఉన్న తులసి చెట్లో ఉంచి, ప్రదక్షిణాలు చేస్తారు.

పరమేశ్వరంగారు, ఓ చేత్తో కాఫీ గ్లాసు పట్టుకుని, ఆ పెరట్లో ఉన్న చిన్న తోటలో ఉన్న ప్రతీ మొగ్గని పువ్వుని పలకరిస్తారు.

మల్లె తీగ మొదల్ని శుభ్రం చేస్తారు. గులాబీ మొక్కల కింద ఉన్న ఎండుటాకుల్ని పండుటాకుల్ని తీసి ఓ మూల వేస్తారు.

రెండు వంకాయలు కోస్తాను. కొత్తిమీర కారం కూర చేస్తావా? బచ్చలాకులు తెంపనా, లేకపోతే నిన్న కావుడు పంపిన సూర్య గుమ్మడి పులుసు చేస్తావా!

నిన్న వస్తూంటే సూరీడు కనపడింది. బూడిద గుమ్మడికాయ వడియాలు పెడ్తున్నాను, ఊర పిండి పంపిస్తానంది. పొద్దున్న పంపితే, పచ్చి వడియాలు, అన్నం తినేముందు వేయించు చక్కగా గారె ముక్కలా ఉంటుంది. ఆనప కాయ కొయ్యనా, ములక్కాడలు, చిలకడ దుంపలు వేసి, చక్కగా యింత బెల్లం ముక్క పడేసి పులుసు చెయ్యి. పప్పు కూరలోకి మజ్జిగ మిరపకాయలు వేయించడం మర్చిపోకు. రేపు క్యాబేజీ ఆవపెట్టి కూర చెయ్యి. చక్కగా పనసకాయ కూరలా ఉంటుంది.

అతని ఫర్మాయిషీలన్నీ ఆవిడ పూర్తిచేస్తుందో లేదో తెలీదు. ఆయన జిహ్వా మాత్రం తెలిసింది.

ఆవిడ మాటలు మరోలా ఉంటాయి.

"ఇవాళ అమావాస్య, నెత్తిన రెండు చెంబులు గుమ్మరించుకోండి. ఇవాళ వారం వర్జ్యం లేదు అని ఉల్లిపాయల పప్పు పులుసు చేసాను. ఇవాళ తలమీద నుంచి పోసుకోనక్కర్లేదు. నీళ్ళు వేడిగా ఉంటాయేమో పాళం చేసుకోండి. ఎక్కువసేపు నీళ్ళల్లో ఉండకండి. జలుబు చేస్తుంది...

ఆయన స్నానం చేస్తూనే, ప్రత్యక్ష భగవానుడికి అర్ఘ్యం యిచ్చి దండం పెట్టుకుని, తువ్వాలు తీసుకుని ఒళ్ళు వొత్తుకుంటూ లోపలికి వెళ్తారు.

ఓ పంచపాత్రతో వచ్చి, అందులోని నీళ్ళని తులసెమ్మ మొదట్లో పోస్తారు. ఆ తర్వాత, పనిమనిషి తోమి బోర్లించిన గిన్నెల్లోంచి, ఓ చిన్న పళ్ళెం తీసి, మల్లెపువ్వులు కనకాంబరాలు, నీలాంబరాలు, మరువం కోసాకా, అరటి చెట్టు వైపు వెళ్ళి, ఆ చెట్టునుంచి తడప (నార)ని పర్రున లాగి పూల పక్కగా ఉంచి, లోపలికెళ్తారు.

అప్పుడు టైం ఎనిమిదవుతూంటుంది. నేను లేచి తయారవ్వాలి. అందుకని రోజూ అంతవరకే చూస్తూంటాను.

అతను కోరిన వంటల్ని ఆవిడ చేస్తుందో లేదో తెలీదు. అరటి నారతో కట్టిన మాల దేవుడికి పెట్టే ఉండవచ్చు. ఆ తర్వాత జరిగేవి నాకు తెలీదు. అవకాశము కూడా లేదు.

కానీ, ఇవాళ సెలవు.

నిన్ననే స్కూలు వార్షికోత్సవం జరిగింది పదిహేను రోజుల్నించి నడుం విరిగేటట్లుగా పోటీలు పెట్టి ప్రతీ విద్యార్థికి ఏదో ఒక బహుమతి వచ్చేలా చేసాం. లేకపోతే పేరెంట్సు మా టీచర్ల మీద ఫిర్యాదులు చేస్తారు. అందుకే ఒక్కొక్క డాన్సుకి పన్నెండు మంది తప్పనిసరిగా తీసుకుని, ఒక్కో నాటకానికి పదిహేను మందిని తీసుకుని, అందర్నీ తృప్తిపరచడానికే ప్రయత్నించాం. ఓ ఎంఎల్యేని ఓ మినిస్టరునీ, ఓ జడ్జిని పిలిచారు. ఆకర్షణీయంగా ఉంటుందని ఇద్దరు సినిమా వాళ్ళని పిలిచారు. మొత్తానికి ఫంక్షన్ అయింది. ఇవాళ సెలవన్నారు. అందుకని యధాప్రకారంగా పొద్దున్న కాఫీ గ్లాసు పుచ్చుకుని బాల్కనీలో కూచున్నాను.

రోజూలాగా, కాఫీ రెండో డోసుని పట్టుకుని చెట్ల దగ్గరుండి పూలతోనూ మొగ్గలతోనూ మాట్లాడ్డం లేదు.

స్నానం చేసే ప్రయత్నంగా బాయిలర్‌కి కుళాయికి మధ్య ముక్కాలి పీట మీద కూచుని ఉన్నారు.

ఆవిడ తులసి కోటకి కొంచెం దూరంలో, ఎండ పడ్తున్నచోట, ఓ స్టూలు మీద, ఓ ఎర్ర, చిన్న గ్యాసు స్టౌవ్ పెట్టుకుని, దానిమీద ఓ ఇత్తడి గిన్నెలో ఏదో కలియపెడ్తూ వొండుతున్నారు.

"ఆ పక్కనే సిబ్బిరేకు మీద రేగు పళ్ళు, జిల్లేడాకులు ఉన్నాయి. నెత్తిన పెట్టుకుని స్నానం చెయ్యండి. ఇవాళ రథసప్తమి..."

"అలాగే" అంటూ రేగు పళ్ళని నెత్తిన పెట్టుకున్నారు. అవి దొల్లిపోతున్నా, అలాగే స్నానం చేసారు.

"ఆ బాయిలరుకి ఆ వెంపున వరాహకట్ట ఉంది. దానితో, ఆ వెంకన్న బాబు, సాయిబాబా ఉంగరాలు తోముకోండి..." వరాహకట్ట అంటే ఏమిటా అని కుతూహలంగా చూసాను. ఓ చిన్న నల్లటి బ్రష్షు. దానితో ఉంగరాల్ని తోమారు.

స్నానం అయ్యాక, పట్టు పంచ కట్టుకుని వచ్చారు.

పార్వతమ్మగారు లేచారు.

"ఉఁ...వచ్చారా! ఇలా వచ్చి ఈ కుర్చీలో కూచుని కలుపుతూండండి". ఆవిడ లేచిన వెంటనే అతను కూచున్నారు.

"ఈ చెరుగ్గడతో కలపడం ఏఁవిటో? ఆ యిత్తడి

గరిట యియ్యి..." ఆవిడ ఆగి వెనక్కి తిరిగారు.

"రథసప్తమి నాడు, మాఘపాదివారాల్లో పరవాణ్ణాన్ని చెరుగ్గడతోనే కలుపుతారు. ఆ చెరకు రసం పరవాణ్ణంలో చేరితే, మధురంగా ఉంటుంది. ఈ రుచి బెల్లం వేసినా రాదు, చక్కెర వేస్తే అసలే రాదు...

ఈ పూట అన్నీ కత్తితో తరగని కూరలతో వంట చేయాలి. చిక్కుడు కాయ పులుసు బెల్లం కూర, టమాటాలు పోపులో వేసి, చారు చేసాను. పప్పు వొండాను. వంటేవిటో ముందే చెప్తున్నాను. యింక తింటున్నంత సేపూ సణక్కండి... పోపులు పొగచాలి... ఆc...ఆ... ముందు దాని సంగతి చూడండి. దగ్గర పడ్తూంటే కిందంటుకు పోతుంది.

అదిగో స్టూలు కింద చిక్కుడాకులు పెట్టాను కదా... అందులో పరవాణ్ణం వేసి నాకందిస్తే, అభేరించేసి మీకు వొడ్డించేస్తాను.

ఆ తర్వాత పరమేశ్వరంగారు ఆ చిన్న యిత్తడి గిన్నెని, చిక్కుడాకుల్ని లోపలికి తీసుకెళ్ళిపోయారు.

ఆవిడ నైవేద్యం పెట్టి ఉండచ్చు... అభేరించి ఉండచ్చు. ఆ తర్వాత నిశ్శబ్దం.

"పార్వతీ! గేటు వేసుకో... మేకలు, కుక్కలు దూరి పోతాయి."

ఆ వైపు చూసాను.

పరమేశ్వరంగారు, తెల్ల పాంటు, నల్ల గళ్ళ చొక్కా, ఓ బ్రీఫ్‌కేసు, ఓ నీళ్ళ సీసాతో బయటికి వెళ్ళిపోయారు.

పార్వతి, గేటు వేసి, అడ్డగడియ పెట్టి యింట్లోకి వెళ్ళారు.

మరి కాస్సేపటికి, ముదురు ఆకుపచ్చ జరీ చీర కట్టుకుని, భర్త ఖాళీ చేసిన కుర్చీలో కూచుని పేపరు మడత విప్పారు.

నున్నగా దువ్విన ముడి, దానిపైన పూల మాల. మల్లెలు, కనకాంబరాలు, నీలాంబరాలు, మరువం. ఆవిడ చీటికీ మాటికీ ఆ దండని సవరిస్తూనే ఉన్నారు.

ఆ పూలలో అరటి నారతో పాటూ ఆయన హృదయం, ప్రేమ ఆత్మ అన్నీ ఉన్నట్లుగా ఆవిడకి అనిపిస్తోందేమో!

ఇంక అక్కడ చూడాల్సిందేమీ లేదు. నేను తల తిప్పి బాల్కనీలోంచి యింట్లోకి చూసాను.

శూన్యంగా అనిపించింది. వాళ్ళతో నన్ను పోల్చుకోడం మొదలెట్టాను. నాదీ, వాళ్ళదీ జీవితాలే. కానీ, జీవించడంలో ఎంత తేడా!

వాళ్ళు ప్రతీ క్షణాన్ని పంచుకుని జీవిస్తున్నారు. మరి నేను! నా క్షణాలు నావి, జగదీశ్ క్షణాలు జగదీశ్‌వి.

ఒకరినొకరు అన్నట్లుగా, ఒకరిమీద ఒకరు ఆధారపడ్తూ... తోడూ నీడా- ఆదర్శ దంపతులన్న ప్రైజు ఏదైనా ఉంటే, వీళ్ళని నేను రికమెండ్ చేస్తా.

వాళ్ళ ప్రతీ మాటలో, పనిలో తెలుగుతనం, సహజమైన సంస్కృతి ప్రతిధ్వనిస్తోంది. వాళ్ళు వాడే పదాలు కొన్ని నాకు తెలీవు.

వాళ్ళు కాలంతోపాటూ నడుస్తున్నారు. నేను కాలానికెదురెళ్తున్నాను. ఆర్నెల్ల క్రితం- జగదీశ్‌కి బదిలీ అయిందని తెలిసినప్పుడు-

"ఈ ఉద్యోగం ఆ ఊళ్ళో కూడా దొరుకుతుంది. ఒక్క దానివి ఇక్కడెందుకూ?

"ఇదే ఉద్యోగం దొరుకుతుంది...కానీ జీతం... ఇంతుంటుందా? ఇది అంతర్జాతీయ స్కూలు కాబట్టి ఇంత జీతం యిస్తున్నారు. మీరెళ్ళే ఊళ్ళో ఇలాంటి స్కూళ్ళుంటాయా? అయినా మూడేళ్ళు యిట్టే గడిచిపోతాయి. ఆ తర్వాత మీరే యిక్కడికిచ్చేయండి. నేను ఊరు రాను..."

వింతగా చూసాడు నావైపు.

"ఓ... నీకు జీతం ముఖ్యం అన్నమాట... నీకు నేను చెప్పలేనులే. నీ యిష్టం వచ్చినట్లుగా ఉండు. నేను ప్రతీ వారం రాలేను. నెలకో రెండు నెలలకో ఓసారి రాగలను..." అని అన్నాడే కానీ, రాలేదు. సెలవు దొరికిన ప్రతీసారి గుంటూరు వెళ్ళాల్సి వచ్చింది. మామగారు రమ్మంటే ఓసారి, పెద్దవాడికి కళ్ళు పరీక్ష చేయించడానికని మరోసారి వెళ్ళాడు. వాడు కూడా గుంటూరులోనే ఉంటున్నాడు.



**"జీవితం గానుగెద్దులా తయారవుతోంది. ఓ దెబ్బ వేస్తేనో, ఓ తాపు తంతేనో కానీ కదలడం లేదు. ఓ ఉత్సాహం లేదు. ఓ బాధ్యత లేదు. ఓ లక్ష్యం లేదు... చాలా బోర్‌గా ఉంది. మా మేనేజరు సెలవు యివ్వనన్నాడు... ఓ నెల పోయాక ఉగాదినాటికి సెలవు తీసుకుని వస్తాను..."**

ఆర్నెల్లయింది జగదీశ్‌ని చూసి. రెండురోజుల క్రితం ఫోన్లో మాట్లాడిన మాటలు గుర్తు తెచ్చుకున్నాను.

"జీవితం గానుగెద్దులా తయారవుతోంది. ఓ దెబ్బ వేస్తేనో, ఓ తాపు తంతేనో కానీ కదలడం లేదు. ఓ ఉత్సాహం లేదు. ఓ బాధ్యత లేదు. ఓ లక్ష్యం లేదు... చాలా బోర్‌గా ఉంది. మా మేనేజరు సెలవు యివ్వనన్నాడు... ఓ నెల పోయాక ఉగాదినాటికి సెలవు తీసుకుని వస్తాను..." జగదీశ్ గొంతులోని జీర యిప్పుడు గుర్తుపట్టాను.

మర్నాడు స్కూలుకెళ్ళినప్పుడు సైన్స్ హెడ్‌కి చెప్పాను. సెలవు కావాలని. వినరాని మాట విన్నట్లు చూసింది. భుజాలెగరేసింది. "నాకు తెలీదు... ప్రిన్సిపాల్‌ని అడగండి... అయినా ఫిబ్రవరిలో లీవు కావాలని ఎలా అడగ్గలుగుతున్నారు?"

ఆమె మాటలు పట్టించుకోకుండా ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళాను. ఆవిడ క్లాసుల్లో జరుగుతున్నవన్నీ కూడా టీవీలోంచి గమనిస్తోంది.

"మీరెళ్ళిపోతే ఎలా! మార్చి మొదటివారంలో పదో క్లాసువాళ్ళకి పరీక్షలు. రివిజన్ చేయించాలి... పేరెంట్స్ ఏమనుకుంటారు! ఇర్రెస్పాన్సిబుల్ అని నన్ను అంటారు. పేరెంట్స్‌ని సంతోషపెట్టాలి. వాళ్ళని తృప్తిపరచాలి. వాళ్ళు మన కస్టమర్స్, అసలు వాళ్ళ మూలంగానే మనకింతంత జీతాలన్న విషయం మీరు గుర్తుపెట్టుకోవాలి..."

సరిగ్గా నేనూ ఇలాగే, ఇదే అర్థం వచ్చేట్లుగా జగదీశ్‌తో మాట్లాడాను. "అవునే చదువు వ్యాపారం కదా...ఆదే భాషలో మాట్లాడుతున్నావ్!" అన్నాడు. అవును చదువు వ్యాపారమే. అందుకే ఆవిడ అలా మాట్లాడింది.

నేను ఏవో కారణాలు చెప్పి, జగదీశ్ దగ్గరికెళ్ళాను.

పిల్లల హాస్టళ్ళకెళ్ళాం, అత్తగారింటికెళ్ళాం. ఆ పక్కనే ఉన్న అమరావతి, మంగళగిరి చూసాం. ఓ పదిహేను రోజులయ్యాక యింటికొచ్చాను.

రైలు దిగగానే పక్క పెరట్లోకి తొంగి చూసే టైము లేక బాల్కనీ తలుపు కూడా తెరవలేదు. స్కూలుకెళ్ళిపోయాను.

సాయంత్రం యింట్లోకి వెళ్తూంటే, పక్క ఫ్లాటులోని రామలక్ష్మి కనపడింది.

"మన ఫ్లాట్ల వెనకాల ఉండే పార్వతి పోయారు... తెలుసా!"

అపనమ్మకంతో చూసాను. నేను ఊరు వెళ్ళి వచ్చేలోగానే... అంత హడావుడిగా పెద్ద పనున్నట్లుగా వెళ్ళిపోయారా!

"ఎప్పుడూ!" ఆశ్చర్యంగా.

"రథ సప్తమి మర్నాడే, భీష్మాష్టమినాడు... ఉత్తరాయణ పుణ్యకాలం అనుకో... తిన్నగా స్వర్గానికెళ్ళారు..."

"ఏవయింది? అంత హఠాత్తుగా... గుండులా ఉండే మనిషి..."

"ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలీదనడానికి ఇదో నిదర్శనం. గుండెపోటు వెంట వెంటనే వచ్చేసింది. సమయానికి ఆవిడ భర్త కూడా లేరు. అతను రిటైరయ్యాక, పక్క వీధిలో ఉన్న స్కూల్లో అకౌంట్సు అవీ చూస్తారట.

స్కూలునుంచి యింటికి వచ్చేసరికి... ఘోరం జరిగిపోయింది... పిల్లలు ముగ్గురు... అంతా ఈ ఊళ్ళోనే. వాళ్ళ సమస్యలేవిటో తెలీదు. కానీ, అంతా వెళ్ళిపోయారు. పాపం ఆయనకి కోలుకోలేని దెబ్బ అనుకోండి..."

నా చెవులు పని చేయడం మానేశాయి.

మర్నాడు పొద్దున్న, కాఫీ గ్లాసుతో పక్కింటి పెరటి వైపు యధాప్రకారంగా చూసాను.

సూర్యకిరణాలు ఏటవాలుగా కొబ్బరాకుల్లోంచి ఏ విధమైన కన్ఫ్యూజన్ లేకుండా, ఆ పెరటి గోడ మీద పాయలుపాయలుగా వాల్తోంది.

పరమేశ్వరంగారు, పాదుల్లోకి నీళ్ళు పంపుతున్నారు. ఆకుల్ని, పువ్వుల్ని పలకరిస్తున్నారు. ఏవో కూరలు కోసారు. ఆఖర్ని పువ్వులు అరటి తడపకోసారు.

ఆయన దినచర్యలో ఏం మార్పులేదు. లోపం లేదు. యధావిధిగా సాగుతోంది. కానీ, లోటు బాగా కనిపిస్తోంది. ఆయన అన్నీ నిశ్శబ్దంగా చేస్తున్నారు. గుండెని ఎవరో పిండేసినట్లనిపించింది.

మర్నాడే రిజైన్ చేసాను. జగదీశ్ దగ్గరకెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

కస్టమర్ దేవుళ్ళలాంటి పేరెంట్స్ గుర్తురాలేదు. మా డిపార్ట్‌మెంట్ హెడ్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ తిట్లు వినిపించుకోలేదు.

జీవితపు లోతులు తెలీనంతగా, కనిపించనంతగా హృదయం మీద మురికి పేరుకోకముందే... జీవితం యింకా పూర్తిగా మాసిపోకముందే, వెలిసిపోకుండా, యింకా బాగా ఆలీసం కాకుండానే జీవిత భాగస్వామితో కలిసి జీవించడం ఏవిటో తెలుసుకుంటే మంచిదనిపించింది.

★

**రచయిత్రి చిరునామా:**
గంటి భానుమతి,
1-205, మే ఫ్లవర్ పార్క్ అపార్ట్‌మెంట్స్,
అన్నపూర్ణ కాలనీ, మల్లాపూర్,
హైదరాబాద్-500 076.